ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

అధికారులకు వినతి పత్రం అందజేసిన నాయకులు

భిక్కనూరులోని తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ/రాజంపేట్/భిక్కనూరు, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు డిమాండ్ చేశారు. ఆయన దివ్యాంగులతో కలిసి బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేల పింఛన్ అమలు చేయాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అంత్యోదయ రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దారం రాములు, కార్యదర్శి ఫయాజ్, గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య, గాండ్ల సాయిలు, మొగులయ్య, గంగాధర్, గంగారాం, బస్వయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భిక్కనూరులోని తహసీల్ కార్యాలయంలో కిసాన్ మోర్చా నాయకులు, రాజంపేటలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి గంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా అందించాలన్నారు. కౌలు రైతులకు సైతం ఎకరానికి రూ.15వేల ఆర్థిక సహకారం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేల అందజేయాలన్నారు. తెలంగాణలో ప్రధానమంత్రి పంటల బీమా యోజనను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, గుర్రాల రాము, కమ్మరి నాగరాజు, సాదుల ప్రవీణ్, కొప్పుల నర్సింహులు, బాల్ నర్సు, లక్ష్మణ్, అనిల్, సతీశ్, భిక్కనూరులో తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందించిన వారిలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రెడ్డిగారి రమేశ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, బసవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకర్, సాయిరెడ్డి, ఆనంద్, నర్సింహులు పాల్గొన్నారు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దోమకొండ, జూలై 9: అప్పుల బాధతో ముత్యంపేట గ్రామానికి చెందిన ఆశబోయిన దేవరాజ్ మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఆశబోయిన దేవరాజ్ ఐదు సంవత్సరాల క్రితం బతుకు దేరువు కోసం దుబాయికి వెళ్లి మూడేండ్ల కిత్రం తిరిగి వచ్చాడన్నారు. రెండేండ్లుగా ఏ పనిలేక ఖాళీగా ఉండేవాడన్నారు. దీంతో అప్పులు ఎక్కువయ్యాయని, వాటి గురించి తరచూ బాధ పడేవాడన్నారు. జీవితంపై విరక్తి వస్తుందని, ఆత్మహత్య చేసుకుంటున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిపోయాడన్నారు. దేవరాజ్ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న ఆశబోయిన స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

మాధవపల్లిలో మొక్కను నాటుతున్న డీఆర్డీవో చందర్ నాయక్

లింగంపేట మండలం సురాయిపల్లిలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

గాంధారి/లింగంపేట/నిజాంసాగర్/బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, జూలై 9: వన మహోత్సవాన్ని విజయవతం చేయాలని డీఆర్డీవో చందర్‌నాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా గాంధారి మండలంలోని మాధవపల్లి గ్రామంలో ఆయన మంగళవారం మొక్కను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే తీసిన గుంతల్లో మొక్కలను నాటాలని తెలిపారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఏపీవో శృతి, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు. లింగంపేట మండలంలోని సురాయిపల్లి గ్రామం లో ఎక్సైజ్ అధికారులు గౌడ కులస్తులతో కలిసి ఈత మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది భూపాల్, రజిత, ప్రవంతి, నవీన్‌తోపాటు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని పోల్కంపేట, ఎల్లమ్మ తండా, శెట్పల్లి, అయ్యపల్లి, పోతాయిపల్లి, కోమట్‌పల్లి, లింగంపేట, లింగంపల్లి, బోనాల్, బాణాపూర్ తదితర గ్రామాల్లో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసినట్లు ఎంపీవో అబ్బాగౌడ్ తెలిపారు. మొక్కలను నాటి సంరక్షించాలని ప్రజలకు సూచించారు.

నిజాంసాగర్‌లోని ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరి, ఏపీవో శ్రీనివాస్, హెచ్ఎం రాంచందర్, టీఏ ప్రభాకర్, ఎఫ్ఏ రాజు, బాల్‌సింగ్, చంద్రవేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆర్డీవో రాథోడ్ రమేశ్ మొక్కలు నాటారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ మొక్కలను ఉపాధిహామీ సిబ్బంది అందజేస్తున్నారని, వాటిని ఇంటి పరిసరాల్లో నాటాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మకుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, ఏపీవో గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ కార్యక్రమాన్ని డీఎల్పీవో నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో రాము, గ్రామ కార్యదర్శి రాజేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోర్లం క్యాంపు గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

నస్రుల్లాబాద్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న డీఎల్పీవో నాగరాజు

నిజాంసాగర్ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి విజయ భాస్కర్

తుజాల్‌పూర్‌కి బస్సు సౌకర్యం కల్పించాలి

బీబీపేట్, జూలై 9 : మండలంలోని తుజాల్‌పూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కామారెడ్డి డిపో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తికి మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి 18 ఏండ్ల నుంచి బస్ సర్వీసు నడుస్తున్నదని, ఇటీవల అనివార్యణ కారణాలతో బస్ రావడం లేదన్నారు. దీంతో గ్రామంలో విద్యార్థులు కళాశాల, పాఠశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్ సేవలను తిరిగి ప్రారంభించాలని డిపో అసిస్టెంట్ మేనేజర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బీబీపేట్, జూలై 9 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్, ఆశావర్కర్ ఇందిరా అన్నారు. మంగళవారం ఇం టింటా తిరుగుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.అంటువ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

బాన్సువాడ టౌన్, జూలై 9 : పేకాడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ హెచ్చరించారు. బాన్సువాడలోని బీడీ వర్కర్స్ కాలనీ సమీపంలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం దాడి చేసినట్లు సీఐ తెలిపారు. పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, 6,030 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

దామరంచలో కంటి వైద్యశిబిరం

నస్రుల్లాబాద్, జూలై 9 : బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో బీర్కూర్ లయన్స్ భవన్ ఐ క్యాంపు సెంటర్‌లో మంగళవారం గ్రామస్తులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 60 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు మేకల గాలయ్య, కోశాధికారి డాక్టర్ రమేశ్, సంతోష్, కిశోర్, రమేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

డ్రైవర్లు, యాజమాన్యాలకు అవగాహన

కామారెడ్డి, జూలై 9 : కామారెడ్డి జిల్లా విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు, యాజమాన్యాలకు జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం ఉంటుందని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. బస్సు డ్రైవరులు, యజమానులు పాల్గొనాలని సూచించారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ తెలంగాణ జాయింట్ సెక్రటరీ పృథ్వీతేజ

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/బిచ్కుంద, జూలై 9 : జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ సెక్రటరీ పృథ్వీతేజ భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రోహిత్, నగర అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రంజిత్ మోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నాయకులు ర్యాలీ తీశారు. ఏబీవీపీ పూర్వ కార్యకర్తలు మంచిర్యాలీ విద్యాసాగర్, నవీన్‌చారి, మహేశ్, తులసీదాస్, వినోద్, బబ్లూ, జాషువా తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముప్పిడి వెంకట్ జెండాను ఆవిష్కరించారు. కార్యకర్తలు యాగరాజు, సాయిరాం, రాహుల్, చాకలి బాలు, ప్రియాంక, అనురాధ, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తండాల్లో సీత్లా వేడుకలు

మాచారెడ్డి, జూలై 9 : మండలంలోని సోమార్‌పేట, బంజపల్లి, ఎల్లంపేట గ్రామాల పరిధిలోని తండాల్లో గిరిజనులు మంగళవారం సీత్లా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవమైన దేవతలను పూజించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలకు తరలి వెళ్లారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

లింగంపేట కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, వంట సిబ్బందితో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- లింగంపేట కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల తనిఖీ
- విద్యార్థినులకు సమయానికి భోజనం వడ్డించాలని ఆదేశం

నాగిరెడ్డిపేట, జూలై 9: విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలను ఆయన సందర్శించారు. కస్తూర్బాలో ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ప్రత్యేక అధికారిణి వీణ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి ఎస్‌వో అనురాధతో మాట్లాడారు. పాఠశాలలోని వంట సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. విద్యార్థినులకు సక్రమంగా అల్పాహారం, భోజనం అందడం లేదని పత్రికల్లో వస్తున్నదని.. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే.. మీ ఉద్యోగాలు ఊడిపోతాయని హెచ్చరించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. చదువు మంచిగున్నదని, భోజనమే బాగా లేదని ఎమ్మెల్యేకు వారు వివరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయినులతో మాట్లాడారు. సిబ్బంది కొరత ఉన్నదని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల పరిసరాలు వెంటనే శుభ్రం చేయించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు ఆరీఫ్, రాంచందర్‌రెడ్డి, ఇమామ్, కిష్టయ్య, లక్ష్మణ్, పర్వతరావు, సంగయ్య, షాహిద్, సురేందర్‌గౌడ్, సాయిబాబాగౌడ్, గులాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మైనార్టీ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూలై 9: ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలించారు. మినీట్యాంక్ బండ్, పార్కు, వాకింగ్ ట్రాక్ తదితర పనులను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. చెరువుకట్టపై చేపడుతున్న పనులను ఇరిగేషన్ డీఈఈ వెంకటేశం.. ఎమ్మెల్యేకు వివరించారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అనంతరం ఆయన ఎల్లారెడ్డిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. హాజరు పట్టికలో సంతకాలు చేసి విధుల్లో లేని ఉపాధ్యాయులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు. ఆయనతో పాటు నాయకులు చెన్న లక్ష్మణ్, సాయిబాబు, కుడుముల సత్యనారాయణ, గయాజుద్దీన్, వినోద్‌గౌడ్, ఆరీఫ్, హెచ్ఎం పద్మ సుధాకర్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వరదారెడ్డి

రామారెడ్డి, జూలై 9: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి వరదారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సదాశివనగర్ మండలంతోపాటు రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో వనమహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలను పరిశీలించారు. కంపోస్టు షెడ్డులో సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. ఉప్పల్‌వాయి గ్రామ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఇద్దరు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించగా.. వారు ఆడిటింగ్‌కు వెళ్లినట్లు అధికారికి తెలిపారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు స్వర్ణలత, మౌనిక ఉన్నారు.

ప్రమాదాల స్పాట్లు గుర్తింపు

రాజంపేట, జూలై 9: మండలంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను అధికారులు మంగళవారం గుర్తించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, సీఐ సంపత్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ రవితేజ, ఎంవీఐ రిచర్డ్‌సన్ తదితరులు కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై సంపత్ తెలిపారు.

ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తిస్తున్న అధికారులు

స్తంభాలను సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

నర్సరీలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాలు సరిచేసిన అధికారులు

నర్సరీని శుభ్రం చేసిన సిబ్బంది

నమస్తే తెలంగాణ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన పలు కథనాలకు అధికారులు స్పందించారు. డోంగ్లీ మండల కేంద్రంలో పలు విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారిన విషయాన్ని 'ప్రమాద ఘంటికలుగా విద్యుత్ తీగలు' అనే శీర్షికతో జూలై 5న వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి వంగిన విద్యుత్ స్తంభాలను మంగళవారం సరిచేశారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో విత్తనాలు మొలకెత్తలేదు. గడ్డి, చెత్తాచెదారంతో దారుణంగా మారింది. నర్సరీ దుస్థితిపై జూలై 8వ తేదీన 'నర్సరీల నిర్వహణ అధ్వానం' అనే శీర్షికతో వార్తను నమస్తే తెలంగాణ ప్రచురితం చేసింది. దీంతో నర్సరీని మంగళవారం శుభ్రం చేశారు. విత్తనాలు నాసిరకంగా ఉండడంతో మొతకెత్తలేదని పంచాయతీ కార్యదర్శి సుధీర్ తెలిపారు.

– డోంగ్లీ, జూలై 9

టీచర్ డుమ్మా.. ఇంటి దారి పట్టిన విద్యార్థులు

ఇలేగావ్ పాఠశాలలో దుస్థితి

టీచర్ రాక.. విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న తరగతి గది

డోంగ్లీ, జూలై 9: ఉపాధ్యాయురాలు డుమ్మా కొట్టడంతో విద్యార్థులు ఇంటి దారిపట్టారు. ఈ ఘటన డోంగ్లీ మండలంలోని ఇలేగావ్ పాఠశాలలో మంగళవారం చోటుచేసుకున్నది. ఇలేగావ్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక ఉపాధ్యాయురాలు విధులను నిర్వహిస్తున్నది. మంగళవారం ఆమె పాఠశాలకు హాజరుకాలేదు. టీచర్ కోసం వేచి చూసిన విద్యార్థులు.. ఆమె రాకపోవడంతో మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి విద్యావ్యవస్థ గాడిలో పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మండల విద్యాధికారి రాములునాయక్‌ను వివరణ కోరగా.. టీచర్ పాఠశాలకు రాని విషయం తనకు తెలియదన్నారు. వివరాలు తెలుసుకొని తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

క్రీడాకారిణికి ఎంపీ అభినందన

ప్రతిభను అభినందిస్తున్న ఎంపీ సురేశ్‌షెట్కార్

బిచ్కుంద, జూలై 9: మండలంలోని తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి ప్రతిభ మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎంపీ షెట్కార్ ఆమెను అభినందించారు. భూటాన్‌లో గత నెలలో నిర్వహించిన గ్రాప్లింగ్ టోర్నీలో ప్రతిభ బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. తనకు ప్రోత్సాహాన్ని అందించిన ఎంపీ సురేశ్‌షెట్కార్‌తోపాటు టోర్నీ స్పాన్సర్‌షిప్‌ను అందించిన పోచారం సోనీ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగిరెడ్డిపేట, జూలై 9: మండలంలోని వదల్‌పర్తి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన కోరబోయిన సిద్ధయ్య గేదె మంగళవారం మేయడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. అధికారులు స్పందించి పరిహారం అందజేయాలని బాధితుడు కోరారు.

తాత్కాలిక ఏజీపీగా సాయిప్రకాశ్ దేశ్‌పాండే

ఎల్లారెడ్డి రూరల్, జూలై 9: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు తాత్కాలిక అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా సాయిప్రకాశ్ దేశ్‌పాండే నియమితులయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక ఏజీపీగా ఆయన నియమితులయ్యారని కోర్టు సిబ్బంది తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు ఉన్న ఏజీపీని మారుస్తూ.. కొత్తగా సాయిప్రకాశ్ దేశ్‌పాండేకు తాత్కాలికంగా బాధ్యతలను అప్పగించారు.

యువతి అదృశ్యం

తులసి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 9: ఎల్లారెడ్డి పట్టణానికిచెందిన అర్వి తులసి అదృశ్యమైందని ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. తులసి 8వ తేదీ సోమవారం ఇంటి నుంచి మోడల్ కాలేజీకి వెళ్తానని ఇంట్లో నుంచి బయల్దేరింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. ఆమె కాలేజీకి రాలేదని అధ్యాపకులు తెలిపారు. దీంతో ఆమె తండ్రి సంతోష్ ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పాన్ షాప్‌లపై దాడి

లింగంపేట, జూలై 9: లింగంపేటలోని రెండు పాన్‌షాప్‌లపై మంగళవారం దా డిచేసి గుట్కా ప్యాకెట్లు, తంబాకు, తోట తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపా రు. దుకాణాల్లో నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న ఆకుల శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఏఎస్సై రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.